క్లుప్తంగా

విద్యార్థులకు కంటిపరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వివిధ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేజీబీవీ, గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 86 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కళ్లద్దాలు అవసరం ఉన్న విద్యార్థులను రిమ్స్‌కు పంపించనున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిమ్స్ హస్పిటల్ కంటి ప్రొఫెసర్ అనీష్, వైద్యాధికారి కిరణ్‌కుమార్, అప్తాల్మిక్ అధికారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలియజేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని గుత్పాల, ఏనుగూడ గ్రామస్తులు కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సురేందర్ ఉన్నారు.

మండల అధ్యక్షుడిని మార్చాలి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాంసి: తాంసి మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నుకున్న అధ్యక్షుడిని మార్చాలని మండల బీజేపీ నాయకులు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో ఎంపీ నగేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బూత్ అధ్యక్షుల సమక్షంలో ఎన్నుకున్న వ్యక్తిని మండల అధ్యక్షుడిగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సదానంద్, నారాయణ, ప్రవీణ్ రెడ్డి, మహేందర్, సుభాష్ పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఇబ్బంది లేకుండా చూడాలి




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానుండటంతో మైనార్టీల ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సాజిదోద్దీన్, కోవ రవి, కొండ గణేశ్, సలీం, హైమద్, శంకర్, వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా భోగ్‌బండార్

నేరడిగొండ: శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా చిన్న బుగ్గారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ధ్వజ స్తంభానికి జెండా ఎక్కించి శుక్రవారం భోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి జాదవ్ సుధాకర్, గ్రామనాయక్ రాథోడ్ చత్రు నాయక్, రాథోడ్ బలిరామ్, గేరియ్యా మాజీ సర్పంచ్ పవార్ విలాస్ రావు, రాథోడ్ ఉత్తమ్, ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ధరసింగ్, జాదవ్ బిక్కు, రాథోడ్ సోమ్లా, రాథోడ్ రూప్‌చంద్ పాల్గొన్నారు.

టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆడే గజేందర్



పాల్గొన్న ఆడే గజేందర్

నేరడిగొండ: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శుక్రవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. పలు విషయాలపై ప్రముఖులు సూచనలు చేసినట్లు వివరించారు.

బీమా.. జీవితానికి ధీమా

- తక్కువ ప్రీమియంతో కార్మికులకు ఉపయోగం
- పోస్టాఫీసు ద్వారా వాయిదాల చెల్లింపు



సిరికొండ పోస్టాఫీసు కార్యాలయం

సిరికొండ: అసలే చిన్న బతుకులు.. రెక్కాడితేగాని డొక్కాడని బ్రతుకులు కర్షక, కార్మికులవి. అలాంటి వారికి ఏదైనా ప్రమాదం జరిగితే కూడబెట్టిన డబ్బును ఆసుపత్రిల్లో ధారబోస్తారు. లక్షల్లో ఖర్చులు.. ప్రాణం బ్రతకలంటే అప్పు చేసి మరీ ఆసుపత్రుల్లో చికిత్సలు తీసుకుంటున్నారు. ఇంటిపెద్ద మరణించిన ఆ కుటుంబం మొత్తం వీధిన పడుతుంది. అలాంటి వారి కోసం కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసుల్లో ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పాలసీ పథకం

తక్కువ ప్రీమియంతో...

కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసు ద్వారా అతి తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా పాలసీ ప్రథకాన్ని ప్రవేశపెట్టింది. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే చికిత్స ఖర్చులను భరిస్తున్నాయి. ఈ ప్రమాద బీమాలను ప్రముఖ సంస్థలకు పోస్టాఫీసు ద్వారా వార్షిక ప్రీమియంను చెల్లించాలి. ప్రీమియం చెల్లించిన వ్యక్తి ప్రమాదం జరిగినా.. లేదా మరణించిన ఆ వ్యక్తికి చెల్లించిన ప్రీమియం ప్రకారం బీమా అందుతుంది. వీటితో పాటు అనేక ప్రయోజనాలు అందిస్తుంది. మార్కెట్లో అనేక ప్రైవేట్ బీమా సంస్థలు ఉన్నా.. అధిక ప్రీమియం ఉండటంతో సామాన్య ప్రజలకు బీమా చెల్లించలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వం తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా ప్రథకాన్ని ప్రవేశపెట్టింది.

18 సంవత్సరాలతో..

ప్రమాద బీమా పాలసీని 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు చెల్లించుకోవచ్చు. ప్రీమియంను కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసు కార్యాలయం ద్వారా ప్రైవేట్ సంస్థలను బీమా పాలసీ చెల్లించుకుంటున్నాయి. టాటా సంస్థ రూ. 520 ప్రీమియంతో రూ. 10 లక్షల ప్రమాద బీమా, నివా సంస్థ రూ. 555, ఆదిత్య బిర్లా సంస్థ రూ. 549, స్టార్‌హెల్త్ ఇన్స్‌రెన్స్ సంస్థ రూ.559, బాజాజ్ అల్లియాన్స్ రూ. 699 ప్రీమియంతో రూ.10 లక్షల బీమా పాలసీలను చెల్లిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం పోస్టాఫీసులో అతి తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా పాలసీని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు ప్రీమియం చెల్లించుకోవచ్చు. ప్రీమియం చెల్లించిన వ్యక్తికి ప్రమాదం సంభవించిన ఆసుపత్రికిలో చికిత్స ఖర్చులు భరిస్తుంది.

– నీధా తక్మీన్,
బ్రాంచీ పోస్టుమాస్టార్, సిరికొండ

కార్మికులకు ప్రీమియం చెల్లించాను



పోస్టాఫీసులో ప్రమాద బీమా పాలసీ పథకం గురించి తెలుసుకుని పంచాయతీల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు ప్రమాద బీమా పాలసీ వార్షిక ప్రీమియం చెల్లించాను. కార్మికులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే పాలసీ ఉపయోగపడుతుంది.

– అరుణ్ కుమార్,
పంచాయతీ కార్యదర్శి, సోన్‌పెల్లి

అన్నదానమే మహాదానం



అన్నదానం చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: అన్నదానమే మహాదానమని తిరుమల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండ అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఆకలితో అలమటించకుండా సేవ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శామల రవి, మల్లికార్జున్, రాజు యాదవ్, బండ సునీల్, సుమంత్, నరేశ్, అరుణ్ సింగ్, శివమణి, కౌశిక్ రెడ్డి, ఊశన్న, సుధాకర్, విజయ్, మల్లేశ్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడంతో యువతలో స్నేహభావం పెరుగుతుందని ఏఎంసీ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని డొంగర్‌గామ్ గ్రామంలో సూర్యవంశీ రాజ్ గొండ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామపటేల్ పెందోర్ బాదు, జహీర్, జితేందర్, బాబారావ్, దత్త, లచ్చు, భీర్‌షావ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజమే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుంట మోహన్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే శాలుశబూతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రాథోడ్ సురేందర్, అభిరాంరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో, ఏఈ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో శంకర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాఘాపూర్‌లో 160 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి మార్చి 10లోగా అన్ని ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామన్నారు. లబ్ధిదారులకు మొదటి విడత రూ. లక్ష అందిస్తామన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ నసిర్, ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శి హేమలత, కొడప లస్మ, భూపెల్లి శ్రీధర్, మర్సుకొల హనుమంతు, రాజేందర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. శుక్రవారం కళాశాలలో ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు, పౌర శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పొదుపు అలవాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో సెల్‌ఫోన్‌లకు లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పౌర శాస్త్ర రిటైర్డ్ లెక్చర్ సుజాతను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు, లెక్చరర్లు చంద్రకాంత్, రమేష్, అజయ్, వినోద్, శ్రీనివాస్, ముబారక్, స్వామి పాల్గొన్నారు.

నటరాజన్‌తో భేటీ అయిన ఆత్రం సుగుణ



మీనాక్షి నటరాజన్‌తో ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్ గాంధీభవన్ వేదికగా శుక్రవారం తెలంగాణ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ హాజరయ్యారు. ఈసందర్భంగా టీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను సుగుణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి సంక్షేమ పథకాలపై చర్చించారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసమే కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

దస్తురాబాద్: ప్రజల రక్షణ కోసమే గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్‌సెర్చ్) నిర్వహిస్తున్నట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. శుక్రవారం మండలంలోని దేవునిగూడెం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందుకు ఫోన్‌కు వచ్చే ఓటీపీలు అపరిచితులకు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరం ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ధ్రువ పత్రాల్లేని 40 బైక్‌లకు జరిమానాలు విధించారు. అనంతరం రెండు ఆటోలు, నెంబర్ ప్లేట్ లేని మూడు బైక్‌లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ సైదారావు, కడెం, ఖానాపూర్, పెంబి ఎస్సైలు శంకర్, రాహుల్, కృష్ణ సాగర్‌రెడ్డి, హనుమంతు ఏఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



విజ్ఞాన్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ వేడుకలు



ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: మండలంలో శుక్రవారం కేజీబీవీ, కోకస్ మన్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాలను పాఠశాలలో ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారి మల్లిక, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కిట్, డ్యాన్స్, ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రావు, ఉపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయులు టి.గంగాభవాని, ఆర్.బాబుసింగ్, జి.సౌజన్యలను శాలువాతో సత్కరించారు.

బోథ్: మండల వ్యాప్తంగా సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని విజ్ఞాన్ పాఠశాల, నాగభూషణం పాఠశాలతో పాటు పలు పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ప్రతీ విద్యార్థి సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని యాపల్‌గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. శుక్రవారం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మొదట భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు పరిశోధన రంగంలో కూడా సైన్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రాజు, కట్టా వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



సైన్స్ ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ పాఠశాల నం.2 ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో సైన్స్ మేళా నిర్వహించారు. ప్రతీ విద్యార్థికి సైన్స్ ఆలోచన ఉండాలనే ఉద్దేశంతో సైన్స్‌మేళా నిర్వహించడం జరిగిందన్నారు. శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వివిధ శరీర అవయవాలకు సంబంధించి సైన్స్ ప్రదర్శనలను ఫిజికల్ సైన్స్, గణితం, తదితర అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపతి, శైలేందర్, సునీత, సుచరిత, విద్యార్థులు, తది తరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు, మరుగుదొడ్ల చెల్లింపులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమైనందున పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్ రావ్ పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం భీమన్న జాతరను ఘనంగా నిర్వహించారు. భీమన్న ఉత్సహ విగ్రహాలకు గంగ నీళ్ల స్నానం చేసిన తర్వాత భీమన్న గుట్ట వద్ద ఆలయంలో విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, నైవైద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరమల్ల నారాయణ, సభ్యులు పెరమల్ల పోశెట్టి, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడాలి



పోట్‌పల్లిలో మొక్కలు పరిశీలిస్తున్న వెంకటరమేశ్

లోకేశ్వరం: నర్సరీలో పెంచుతున్న మొక్కలకు నీటిని అందించి కాపాడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్, పోట్‌పల్లి గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు. నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాలను పరిశీలించి మాట్లాడారు. రోడ్లను రోజు శుభ్రం చేయిస్తూ.. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏ శారద తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులకు వచ్చేలా చూడాలి

లోకేశ్వరం: జాబ్ కార్డులున్న కూలీలు ఉపాధిహామీ పనులకు వచ్చేలా చూడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తూ.. కూలీల హాజరు పెరిగేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

అలరించిన వీడ్కోలు

బోథ్: మండల కేంద్రంలోని వాగ్దేవి కళాశాలలో శుక్రవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండేళ్ల పాటు విద్యాభ్యాసం చేసిన కళాశాలలో తమ అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కార్తీక్, ముత్యం, సతీష్, అధ్యాపకులు హరీశ్, మహేశ్, దత్తు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.